క్లుప్తంగా

ముగిసిన శిక్షణ తరగతులు

గుడివాడ టౌన్: ఆంధ్రప్రదేశ్ స్కిల్ డవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో స్థానిక వీకే ఆర్, వీఎన్‌బీ అండ్ ఏజీకే ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహిస్తున్న ఏడబ్ల్యూఎస్, క్లౌడ్ కంప్యూటింగ్ శిక్షణ తరగతులు శుక్రవారం ముగిశాయి. ఈ సందర్భంగా ప్రోగ్రామ్ కో ఆర్డినేటర్ జి.వెంకటరత్నం మాట్లాడుతూ ఇంజినీరింగ్ చివరి సెమిస్టర్ చదువుతున్న 120 మంది విద్యార్థులకు రెండు వారాలపాటు ఈ శిక్షణ ఇచ్చామన్నారు. ప్రిన్సిపాల్ ఎస్‌హెచ్‌వీ ప్రసాదరావు, డైరెక్టర్ కల్యాణ్ కుమార్, కరస్పాండెంట్ వేములపల్లి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

సబ్సిడీ పథకాలను వినియోగించుకోవాలి

పామర్రు: ఉద్యాన శాఖ ద్వారా ప్రభుత్వం అందించే సబ్సిడీ పథకాలను రైతులుసద్వినియోగం చేసుకోవాలని దీనికి స్థానిక వీఏఏలు తగు విధంగా సహకరించాలని జిల్లా ఉద్యాన శాఖ అధికారి జ్యోతి అన్నారు. స్థానిక మార్కెట్ కమిటీ ఆవరణలో పామర్రు డివిజన్ స్థాయి గ్రామ వ్యవసాయ సహాయకుల శిక్షణ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ప్రతి సచివాలయంలో ఉన్న వీఏఏలు రైతులకు ఉద్యానశాఖ పథకాలను వివరించి వారికి తెలియజేయాలని అన్నారు. ఎఫ్‌టీసీ ఏడీఏ జ్యోతిరమణి, పామర్రు ఏడీఏ స్వర్ణలత, వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు ఆరుమళ్ల శ్రీనాథ్‌రెడ్డి, ఏఎస్‌వో సుప్రియ, ఎఫ్‌టీసీ ఏవో శ్రీనివాస్, తోట్లవల్లూరు, గుడ్లవల్లేరు, కంకిపాడు, పామర్రు వ్యవసాయ అధికారులు, వీఏఏలు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

తోట్లవల్లూరు: మండలంలో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఉయ్యూరు ట్రాన్స్‌కో ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు కృష్ణానాయక్ తెలిపారు. తోట్లవల్లూరు, యాకమూరు, పాములలంక, వల్లూరుపాలెం, పెనమకూరు, దేవరపల్లి సబ్‌స్టేషన్ల పరిధిలో విద్యుత్ లైన్ల సాంకేతిక మరమత్తుల కారణంగా ఉదయం 7 గంటల నుంచి 9 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

పమిడిముక్కల: విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా పమిడిముక్కల, కృష్ణాపురం సబ్‌స్టేషన్లలో ఉదయం 7 గంటల నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ శ్రీనివాసరావు తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

అగ్నిప్రమాదాలపై అవగాహన

గుడివాడ టౌన్: అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు అప్రమత్తంగా ఉండి నివారణ చర్యలు చేపట్టాలని అగ్నిమాపక శాఖ జిల్లా అధికారి జే ఆంజనేయులు పేర్కొన్నారు. స్థానిక ఏఎన్నార్ కళాశాలలో 16 ఆంధ్రా బెటాలియన్ మచిలీపట్నంఆధ్వర్యంలోఎన్‌సీసీ విద్యార్థులకు శుక్రవారం అగ్ని ప్రమాదాలు, నివారణ, మెళకువలపై అవగాహన సదస్సు నిర్వహించారు. అగ్నిప్రమాదాల నివారణ ప్రక్రియలను ప్రయోగాత్మకంగా చేసి చూపించారు. ఎన్‌సీసీ అధికారులు, ఫైర్ సిబ్బంది పాల్గొన్నారు.

వైఎస్సార్ బీమా సాయం

పమిడిముక్కల: మంటాడ రెడ్డిపాలెంలో సచివాలయ గృహసారధి పిడింట్ల వెంకటప్పన్న (41) శుక్రవారం గుండెపోటుతో మృతిచెందారు. మృతునికి భార్య, ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ ఆదేశాల మేరకు వైఎస్సార్ బీమా పథకం కింద మట్టి ఖర్చుల నిమిత్తం రూ.10 వేలు అందజేశారు. సర్పంచ్ నందమూడి వీరమ్మ, ఎంపీటీసీ మేరుగ లక్ష్మి, రాష్ట్ర రెడ్డిక కార్పొరేషన్ డైరెక్టర్ కంభపు రాంబాబు, రెడ్డిక సంక్షేమ సంఘం అసోసియేట్ ప్రెసిడెంట్ చల్లా లక్ష్మణరెడ్డి, పార్టీ నాయకులు కోడెబోయిన కోటేశ్వరరావు, పండలనేని సాంబశివరావు, ధూళిపూడి వీరకోటేశ్వరరావు, వెల్ఫేర్ అసిస్టెంట్ సాయిలక్ష్మి, పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

గుడివాడటౌన్(నందివాడ): పేకాట రాయుళ్లను అరెస్ట్ చేసి రూ.2,860 నగదు స్వాధీనం చేసుకున్నట్లు నందివాడ ఎస్ఐ శిరీష శుక్రవారం తెలిపారు. విశ్వసనీయ సమాచారం అందడంతో సిబ్బందితో దాడిచేశామని వివరించారు. నందివాడ మండలం తుమ్మలపల్లి గ్రామం శివారు చేపల చెరువు వద్ద జూదం ఆడుతున్న సమాచారం రావడంతో ఆరుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నామని, శనివారం కోర్టుకు తరలిస్తామని తెలిపారు.

నోట్ పుస్తకాల పంపిణీ

గుడివాడ టౌన్: మూలానక్షత్రం సందర్భంగా శుక్రవారం పట్టణంలో వివిధ దేవాలయాల్లో 782 మంది విద్యార్థులకు నోటు పుస్తకాలు, పూజాసామగ్రి పంపిణీ చేశారు. పెద్ద సంఖ్యలో అక్షరాభ్యాసాలు చేశారు. స్థానిక భీమేశ్వర స్వామి దేవస్థానంలో (పెద్ద శివాలయంలో) 121 మందికి, శంకర మందిరంలో 256, స్థానిక వాసవీచౌక్ లోని కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో 405 మంది చిన్నారులు సరస్వతీ దేవి పూజల్లో పాల్గొన్నారు. కన్యకాపరమేశ్వరి దేవస్థానం ఆధ్వర్యంలో భారీ అన్నసమారాధన నిర్వహించారు.

అంకమ్మతల్లికి సారె సమర్పణ

తోట్లవల్లూరు: గరికపర్రులోఅంకమ్మతల్లికి సారె సమర్పణ కార్యక్రమం కోలాహలంగా జరిగింది. తెలుగు రాష్ట్రాల్లోని వివిధ ప్రాంతాల్లో నివశిస్తున్న వీరంకి వారి ఆడపడుచులు ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున పాల్గొన్నారు. గ్రామాల వారీగా భక్తులు మేళతాళాలతో ఊరేగింపుగా ఆలయానికి తరలివచ్చి అమ్మవారికి పసుపు, కుంకుమలు, చీర, రవికె, గాజులు, పూలు, పండ్లు, స్వీట్లు సమర్పించారు. అన్నసమారాధన జరిగింది. ఆలయ చైర్మన్ వీరంకి వెంకటేశ్వరరావు గౌడ్, కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

ఎన్నికల వాగ్దానాలన్నీ నెరవేర్చాం

- రాజ్యసభసభ్యులు ఆళ్ల అయోధ్య రామిరెడ్డి
- పామర్రులో నియోజకవర్గ ఆత్మీయ సమావేశం



మాట్లాడుతున్న రాజ్యసభ సభ్యులు ఆళ్ల అయోధ్యరామిరెడ్డి

పామర్రు: ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానాలనే కాకుండా ఇవ్వని వాగ్దానాలను కూడా నెరవేర్చామని ప్రతి ఇంటికీ మంచి జరిగితేనే వైఎస్సార్ సీపీకి ఓటు వేయండని సగర్వంగా చెప్పాలని రాజ్యసభ సభ్యులు ఉమ్మడి కృష్ణా జిల్లా, గుంటూరు జిల్లాల రీజినల్‌కో ఆర్డినేటర్ ఆళ్ల అయోధ్యరామిరెడ్డి అన్నారు. స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో పామర్రు నియోజకవర్గ స్థాయి ఆత్మీయ సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా రామిరెడ్డి పాల్గొన్నారు. తొలుత ఏఎంసీలోని దివంగత నేత వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జనాభాలో ఎస్సీ, ఎస్టీ బీసీ, మైనార్టీ, అగ్రవర్ణాల పేదలు సుమారు 70 శాతానికి పైగా ఉన్నారని అన్నారు. గత టీడీపీ ప్రభుత్వం వారిని ఓటు బ్యాంక్‌గానే పరిగణించిందని విమర్శించారు. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ బీసీ, మైనార్టీ అగ్రవర్ణ పేదల అభ్యున్నతికి పెద్దపీట వేసిందని అన్నారు. వారి హక్కులను కాపాడటంలో, అర్థవంతమైన సాధికారిత కార్యక్రమాలు అమలు చేయడంలో నిబద్ధతతో పని చేస్తోందన్నారు. దీనిలో భాగంగా సామాజిక సాధికారత యాత్ర నిర్వహిస్తామని అన్నారు. గత నాలుగున్నర ఏళ్లలో అసమానమైన సంక్షేమ పథకాల ద్వారా అభివృద్ధికి దోహద పడ్డారని తెలిపారు. ఒకవైపు టీడీపీ ధనవంతులైన తమ పెట్టుబడిదారీ స్నేహితుల ప్రయోజనాలకు ప్రాధాన్యత ఇస్తే, మన జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం అణగారిన, బడుగు బలహీనవర్గాలకు సమాజంలో మంచి గుర్తింపును, స్థాయిని కల్పించేందుకు కృషి చేస్తోందన్నారు. నవంబరు 9న పామర్రులో జరిగే బస్సు యాత్రను విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు. రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో ఏపీలో జగనన్న, పామర్రు నియోజకవర్గంలో కైలే అనిల్‌కుమార్ గెలిచి వైఎస్సార్ సీపీ జెండాను ఎగురవేస్తారని ధీమా వ్యక్తం చేశారు. పెనమలూరు ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి మాట్లాడుతూ పేదల అభ్యున్నతికి సీఎం జగన్ చేస్తున్న కృషి ఎంతో అభినందనీయమని అన్నారు. రానున్న 30 ఏళ్ల వరకు రాష్ట్రానికి సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డిని చేసేందుకు ప్రజలు సంసిద్ధంగా ఉన్నారని తెలిపారు. పామర్రు ఎమ్మెల్యే కై లే అనిల్‌కుమార్ మాట్లాడుతూ సమ సమాజ స్థాపనే ధ్యేయంగా సీఎం జగన్ కృషి చేస్తున్నారని, వెనుక బడిన వర్గాలకు ప్రథమ ప్రాధాన్యం ఇచ్చి గౌరవిస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో ఐదు మండలాలకు చెందిన ఎంపీపీలు, జెడ్పీటీసీలు, వైస్ ఎంపీపీలు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, గ్రామాల సర్పంచ్‌లు, వలంటీర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

వైఎస్ జగన్ మళ్లీ సీఎం కావడం ఖాయం

ఎమ్మెల్సీ జయమంగళ

కలిదిండి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి సీఎంగా అఖండ మెజారిటీతో విజయం సాధిస్తారని ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ అన్నారు. కలిదిండి మండలం పెద లంక పంచాయతీ పెదపుట్లపూడి గ్రామంలో ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను ఇంటింటికీ తిరిగి శుక్రవారం ప్రచారం చేశారు. గ్రామానికి ఆర్టీసీ బస్సు సర్వీసులను పెంచాలని పలువురు గ్రామస్తులు కోరారు. మరికొంతమంది రేషన్ కార్డుల్లో పేర్లు చేర్చాలని ఆయనకు విన్నవించుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) నియోజకవర్గ అభివృద్ధి కృషి చేస్తున్నారన్నారు. ఇరువురం కలిసి ప్రజా సమస్యలను పరిష్కరిస్తామన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు సయ్యపురాజు గుర్రాజు, గ్రామపెద్దలు వాసురాజు, జాలాచంద్రుడు, కొక్కిరగడ్డ వీరాంజనేయులు, ఒడుగు గోపాలం, దుర్గారావు పాల్గొన్నారు.

ప్రతి కుటుంబానికి స్వచ్ఛమైన తాగునీరు

ఎమ్మెల్యే డీఎన్నార్



వాటర్ ఫిల్టర్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే డీఎన్నార్

కలిదిండి: ప్రతి కుటుంబానికి స్వచ్ఛమైన తాగునీటిని అందించటమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) అన్నారు. మండలంలోని సంతోషపురంలో రూ.5 లక్షల నిధులతో నిర్మించిన రక్షిత పథకం మైక్రో వాటర్ ఫిల్టర్‌ను శుక్రవారం ఎమ్మెల్యే డీఎన్నార్ ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ చందన ఉమామహేశ్వరరావు, వైస్ ఎంపీపీలు కూసంపూడి కనక దుర్గారాణి, కట్టా నాగలక్ష్మి, ఏఎంసీ ఉపాధ్యక్షుడు పాము రవికుమార్, సీనియర్ నాయకుడు కొల్లాటి సత్యనారాయణ, ఎంపీటీసీ నంద్యాల ఏడుకొండలు, సర్పంచులు ద్రోణాద్రి నాగలక్ష్మి, మసిముక్కల మారుతి ప్రసన్న, సానా మీనా సరస్వతి, పీఏసీఎస్ అధ్యక్షుడు వడుపు రామారావు తదితరులు పాల్గొన్నారు.

చదువుల తల్లీ పాహిమాం



తటివర్రు రోడ్‌లో శ్రీసరస్వతిదేవిగా అమ్మవారు



కొల్లేటికోట పెద్దింట్లమ్మ



కుమ్మమూరులో సరస్వతిదేవిగా అమ్మవారు



భీమేశ్వరస్వామి దేవస్థానంలో సరస్వతీ దేవిగా అమ్మవారు



వేమవరంలో సరస్వతీ దేవిగా కొండలమ్మ



మామిళ్లపల్లిలో సరస్వతీదేవి అలంకరణ

గుడివాడరూరల్: దేవీశరన్నవరాత్రి మహోత్సవాల సందర్భంగా శుక్రవారం తటివర్రురోడ్‌లో ఏర్పాటు చేసిన మండపంలో అమ్మవారు శ్రీసరస్వతిదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఉత్సవ కమిటీ సభ్యులు బేతంశెట్టి వెంకటరవికుమార్, ఈశ్వర్ కుమార్, చంటి, నాగేశ్వరరావు పాల్గొన్నారు. చిన ఎరుకపాడులో శ్రీఅష్టలక్ష్మీ అమ్మవారి దేవస్థానంలో అమ్మవారు శ్రీసరస్వతిదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ట్రస్టీ బొప్పూడిసుబ్రహ్మణ్యేశ్వరరావు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. దేవస్థాన కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

గుడివాడ టౌన్: దేవీశరన్నవరాత్రి మహోత్సవాల సందర్భంగా పట్టణంలోని అన్ని దేవాలయాల్లో అమ్మవార్లను శుక్రవారం శ్రీ సరస్వతీ దేవిగా అలంకరించారు. స్థానిక శ్రీ భీమేశ్వరస్వామి దేవస్థానం(పెద్ద శివాలయం)లో, కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో, శంకర మందిరంలో, గౌరీశంకరస్వామి దేవస్థానంలో, నీలామహల్ రోడ్‌లోని విజయదుర్గ అమ్మవారి దేవస్థానంలో, వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో, పిన్నమనేని నగర్ లోని శ్రీ నాగదుర్గాదేవి అమ్మవారి దేవస్థానంలో సరస్వతీ దేవిగా అలంకరించి భక్తులకు దర్శనానికి ఉంచారు.

సరస్వతీ దేవిగా కొండలమ్మ

గుడ్లవల్లేరు: వేమవరం కొండలమ్మ తల్లి అమ్మవారు శ్రీ సరస్వతీ దేవిగా శనివారం భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ పండితుల వేద మంత్రోచ్చరణ నడుమ అమ్మవారి సన్నిధిలో హోమాలను చేపట్టారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ సురేష్, చైర్మన్ శేషం గోపి, ధర్మకర్తలు పాల్గొన్నారు.

వెండి కంచం సమర్పణ..

కూచిపూడి(మొవ్వ): మండలంలో శుక్రవారం అమ్మవారు సరస్వతి దేవిగా భక్తులకు దర్శనమివ్వగా విద్యార్థులు, చిన్నారులు సరస్వతీ దేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కూచిపూడిలోని శ్రీ బాలా త్రిపుర సుందరి దేవి అమ్మవారి ఆలయంలో ధర్మకర్తల మండలి అధ్యక్షులు కావూరి భానుమూర్తి, ఉపాధ్యక్షులు పసుమర్తి నారాయణమూర్తి తదితరులు 50 మంది చిన్నారులకు పుస్తకాలు, పలకలు, పెన్సిళ్లు, ఇతర విద్యోపకరణాలను పంపిణీ చేశారు. కూచిపూడి గ్రామానికి చెందిన పసుమర్తి ఆదినారాయణ కుటుంబ సభ్యులు బాలా త్రిపుర సుందరి అమ్మవారికి కేజీ బరువుగల వెండి కంచాన్ని పాలక మండలి సభ్యులకు, అర్చకులకు అందజేశారు.

పామర్రు: దేవీ శరన్నవరాత్రులలో పలు ఆలయాల్లో శుక్రవారం అమ్మవార్లను చదువులతల్లి సరస్వతీ దేవిగా అలంకరించి పూజలు చేశారు. స్థానిక కన్యకాపరమేశ్వరీ అమ్మవారు, పర్వత వర్థినీ దేవిని, అంకమ్మ తల్లి ఆలయంలోని అమ్మవార్లను, సోమేశ్వరస్వామి ఆలయంలోని పార్వతీ అమ్మవార్లను సరస్వతీ దేవిగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. జమీదగ్గుమిల్లి జెడ్పీ హైస్కూల్ ఆవరణలో సరస్వతీ అమ్మవారి ఆలయంలో విద్యార్థులు విశేషంగా పూజలు చేశారు. శీతాల ధనలక్ష్మి, రేవతి, విద్యార్థులు పాల్గొన్నారు.

పమిడిముక్కల: జిల్లాలో ప్రసిద్ధి గాంచిన మామిళ్లపల్లిలోని సర్వతీదేవి ఆలయం శుక్రవారం భక్తులతో కిటకిటలాడింది. మూలానక్షత్రం అమ్మవారి జన్మనక్షత్రం. సరస్వతీదేవి అలంకారంలో ఉన్న అమ్మవారిని దర్శించుకొనేందుకు జిల్లా నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ప్రత్యేక పూజలు చేశారు. మాతాసుజ్ఞానందగిరి అమ్మవారు చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. చిన్నారులకు అక్షరాభ్యాసాలు చేయించేందుకు పెద్ద సంఖ్యలో తల్లిదండ్రులు తరలివచ్చారు. భక్తులకు అన్నసంతర్పణ చేశారు. గ్రామస్తులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఘనంగా ఆయుధ పూజ

పామర్రు: విజయ దశమి సందర్భంగా శుక్రవారం పామర్రు, యలమర్రు రోడ్డులోని ఏవీఆర్ఎం ఐటీఐ కళాశాలలో ఆయుధ పూజ నిర్వహించారు. సంస్థ అధినేత ఏ పూర్ణచంద్రారెడ్డి దంపతుల ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు చేశారు. ఐటీఐ కళాశాలకు చెందిన వివిధ రకాల ఆయుధాలను పెట్టి పూజ జరిపించారు. విద్యార్థులకు ప్రసాదాలను వితరణ చేశారు. ఎస్. దాశరధిబాబు, విద్యార్థులు హాజరయ్యారు.

మండవల్లి: స్థానిక శ్రీ భ్రమరాంబ సమేత మల్లేశ్వర స్వామి ఆలయంలో అమ్మవారు శ్రీ సరస్వతీ దేవిగా దర్శనమిచ్చారు. గొట్టిముక్కల సత్యనారాయణరాజు దంపతులు పూజలు చేశారు. ఈవో శింగనపల్లి శ్రీనివాసరావు పర్యవేక్షించారు. లోకుమూడి దత్తాశ్రమంలో ఆశ్రమ ఎగ్జిక్యూటివ్ ట్రస్టీ గురజాడ ఉదయ్‌శంకర్ ఆధ్వర్యాన మహిళలు శ్రీ లలితా సహస్ర నామ పారాయణ సహిత కుంకుమార్చన నిర్వహించారు. స్థానిక విజయదుర్గ ఆలయంలో అమ్మవారిని సరస్వతీ దేవిగా అలంకరించారు. లింగాల శివాలయంలో అమ్మవారు సరస్వతీ దేవిగా పూజలు అందుకున్నారు.

తోట్లవల్లూరు: మండలంలోని కుమ్మమూరు కోదండ రామాలయంలో అమ్మవారు శుక్రవారం శ్రీసరస్వతిదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ అర్చకుడు పరాశరం సత్యమూర్తి ఆధ్వర్యాన అమ్మవారికి ప్రత్యేక పూజలు జరుగుతున్నాయి.

అలరించిన భరతనాట్యం

గుడివాడ టౌన్: స్థానిక గౌరీశంకరపురంలో గౌరీ శంకరస్వామి దేవస్థానంలో శుక్రవారం రాత్రి నిర్వహించిన భరతనాట్య ప్రదర్శన ఆకట్టుకుంది. పట్టణానికి చెందిన సిరి కూచిపూడి నాట్య కళాక్షేత్రం కళాకారుల ఆధ్వర్యంలో నిర్వహించిన నాట్య ప్రదర్శన చూపరులకు కనువిందు చేసింది. ఆలయ ఈఓ నటరాజన్ షణ్ముగం, ఆలయ కమిటీ చైర్మన్ పంచకర్ల వెంకట్, సభ్యులు వి.బాలకృష్ణమూర్తి, కె.నారాయణరెడ్డి, మూడెడ్ల ఉమ, రావులకొల్లు హైమావతి, డి.వజ్రలత, ఆత్మూరి రంగామణి, భక్తులు పాల్గొన్నారు.

సరస్వతీ వార్తకు కలపాలి..

కైకలూరు: దేవీ శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా శుక్రవారం అమ్మవార్లు సరస్వతీ దేవి అలంకరణలో భక్తులకు దర్శినమిచ్చారు. చిన్నారులకు పుస్తకాలు, పలకలు, పెన్నులను దాతలు అందించారు. కైకలూరు వైఎస్సార్ నగర్ (కరకట్ట) వద్ద దసరా మహోత్సవాల పందిరిలో 90 మంది చిన్నారులు సామూహిక సరస్వతీ పూజలు చేశారు. ఎమ్మెల్యే డీఎన్నార్ సతీమణి వీరాకుమారి చిన్నారులకు పుస్తకాలు, పలకలు, పెన్నులు అందించారు. కొల్లేటికోట పెద్దింట్లమ్మ దేవస్థానంలో అమ్మవారికి నూతన వస్త్ర, పుష్పాలంకరణ, నవకలశ పూజ,లలిత సహస్రనామ కుంకుమపూజలు చేశారు. ఆకివీడుకు చెందిన ఉంగరాల నాగ పరమేశ్వరరావు, జ్యోతి, దొడ్డిపట్లకు చెందిన గొట్టుముక్కల శివరామరాజు, శాంతిప్రియ దంపతులు అమ్మవారికి పూజలు చేశారు. భుజబలపట్నంకు చెందిన కొత్తపల్లి నాగధర లక్ష్మీతేజా వర్మ, కను మూరి వెంకట పాండురంగ బాపిరాజు వర్మ దంపతులు అమ్మవారికి వెండి కిరీటం, వెండి బిందె, బంగారపు బొట్టును కానుకగా సమర్పించారు. ఆలయ ఈవో కెవీ గోపాలరావు ఏర్పాట్లను పర్యవేక్షించారు.



కూచిపూడి ఆలయంలో వెండి కంచం అందజేస్తున్న దాతలు



జమీదగ్గుమిల్లిలో సరస్వతీ ఆలయంలో పూజలు చేస్తున్న విద్యార్థులు



నాట్యప్రదర్శన చేస్తున్న కళాకారులు

పేదలకు వైద్యం భారం కాకూడదనే..

ఎమ్మెల్యే డీఎన్నార్



సంతోషపురంలో పదార్థాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే డీఎన్నార్



గుడివాడలో కంటి పరీక్షలను పరిశీలిస్తున్న ఆర్డీఓ పద్మావతి, కమిషనర్

కలిదిండి: పేదలకు వైద్యం భారం కాకూడదని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులు తెచ్చారని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) తెలిపారు. మండలంలోని సంతోషపురం గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని శుక్రవారం ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎంపీపీ చందన ఉమామహేశ్వరరావు, వైస్ ఎంపీపీలు కూసంపూడి కనక దుర్గారాణి, కట్టా నాగలక్ష్మి, ఏఎంసీ ఉపాధ్యక్షుడుపాము రవికుమార్, సీనియర్ నాయకులు కొల్లాటి సత్యనారాయణ, ఎంపీటీసీ నంద్యాల ఏడుకొండలు, సర్పంచ్‌లు ద్రోణాద్రినాగలక్ష్మి,మసిముక్కల మారుతి ప్రసన్న, సానా మీనా సరస్వతి, పీఏసీఎస్ అధ్యక్షుడు వడుపు రామారావు,వైద్యులు, పాల్గొన్నారు.

ముగిసిన ఆరోగ్య సురక్ష శిబిరాలు

పమిడిముక్కల: మండలంలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు శుక్రవారంతో ముగిశాయి. అగినపర్రు హైస్కూల్‌లో శుక్రవారం వైద్య శిబిరాన్ని సర్పంచ్ కోట మణిరాజు ప్రారంభించారు. వైద్యులు అఖిల, బాలాజీ 350 మంది రోగులకు పరీక్షలు జరిపి మందులు అందజేశారు. ఎంపీడీఓ విఠల్‌పాల్, ఈవోఆర్డీ వెంకటేశ్వరరావు, మామిళ్లపల్లి సర్పంచ్ ఆముదాలపల్లి సుబ్రమణ్యం, ఎంపీటీసీ జుఝవరపు శృతి, మండల పార్టీ అధ్యక్షుడు యలమంచిలి గణేష్, వైస్ ఎంపీపీ గంజాల సీతారామయ్య, రాష్ట్ర గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ శొంఠి వెంకటేశ్వరరావు, మండల సచివాలయ కన్వీనర్ పరసా జగన్, పార్టీ నాయకులు మారపాక మహేష్ తదితరులు పాల్గొన్నారు.

716 మందికి ఆరోగ్య పరీక్షలు

గుడివాడ టౌన్: జగనన్న ఆరోగ్య సురక్ష వలన ఎంతో మందికి ఆరోగ్య భద్రత ఏర్పడుతుందని ఆర్డీఓ పి.పద్మావతి అన్నారు. స్థానిక ఎన్టీఆర్ కాలనీలో శుక్రవారం ఎన్టీఆర్ కాలనీ-2 సచివాలయ పరిధిలోని ప్రజలకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. ఆర్డీఓ పద్మావతి మాట్లాడుతూ 40 నుంచి 45 మధ్య వయస్సుగల వారిలో షుగర్, బీపీ ఉన్నట్లు వైద్యులు నిర్ధారిస్తున్నారన్నారు. అప్పటి వరకు తమ ఆరోగ్య పరిస్థితిపై దృష్టిపెట్టని ప్రజలు ఇప్పుడు జాగ్రత్తలు తీసుకుంటున్నారన్నారు. మొత్తం 716 మందికి పరీక్షలు నిర్వహించామన్నారు.

600 మందికి వైద్య పరీక్షలు

గుడివాడరూరల్: మండల పరిధిలోని దొండపాడు గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఎంపీపీ గద్దే పుష్పరాణి, అధికారులు, ప్రజాప్రతినిధులతో కలసి శుక్రవారం గుడివాడ మార్కెట్ యార్డ్ చైర్‌పర్సన్ మట్టా నాగమణి విక్టర్ ప్రారంభించారు. 600 మందికి మందులు పంపిణీ చేశారు. జెడ్పీటీసీ సభ్యుడు గోళ్ల రామకృష్ణ, మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు మట్టా జాన్‌విక్టర్, మోటూరు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సతీష్‌కుమార్, వైస్ ఎంపీపీ భట్టు నాగమల్లేశ్వరి, సర్పంచ్ చోరగుడి సురేఖ, సైదేపూడి సర్పంచ్ దుంపల వెంకమ్మ, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు గద్దే వెంకటరామాంజనేయులు(రాము), దుంపల ఏడుకొండలు, ఎంపీడీవో వెంకటరమణ, తహసీల్దార్ కె.ఆంజనేయు లు,ఇన్‌ఛార్జీ పంచాయతీ కార్యదర్శి హరికృష్ణ, వైద్యులు, సచివాలయ ఉద్యోగులు, వైద్య,ఆరోగ్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

కైకలూరు: స్థానిక మాత ఇంగ్లిషు మీడియం స్కూల్‌లో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఎంపీపీ అడవి కృష్ణ ప్రారంభించారు. ముఖ్యఅతిథిలుగా విచ్చేసిన మండవల్లి, ముదినేపల్లి ఎంపీపీలు పెద్దిరెడ్డి శ్రీరామ దుర్గాప్రసాద్, రామిశెట్టి సత్యనారాయణ రోగులకు మందుల కిట్లను పంపిణీ చేశారు. సర్పంచ్ దానం మేరీ నవరత్నకుమారి, కైకలూరు వ్యవసాయ మార్కెట్ యార్డు చైర్‌పర్సన్ దండే పుష్పలత,మండల ప్రత్యేకాధికారి కేపీ చంద్రశేఖరరావు, తహసీల్దారు బి.మురళీకృష్ణ, ఎంపీడీవో ఎన్.ఉమామహేశ్వరరావు,ఈవోపీఆర్డీవి.రవిశంకరరావు, ఈవో శివన్నారాయణ, డాక్టర్లు బి.శంకర్, రాజేంద్ర,అశ్మిత, అన్నపూర్ణ, కిరణ్‌కుమార్, వార్డు సభ్యులు, సచివాలయ, అంగన్‌వాడీ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

ముదినేపల్లిరూరల్: మండలంలోని వడాలిలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని జెడ్పీటీసీ సభ్యురాలు ఈడే వెంకటేశ్వరమ్మ ప్రారంభించారు. సర్పంచ్ మరీదు దుర్గశ్రీ, ఎంపీటీసీ సభ్యులు పల్లి శ్రీదేవి, మరీదు నాగయ్య, వైఎస్సార్ సీపీ నాయకులు మోత్రు ఏసుబాబు, శీలం రామకృష్ణ, ఈడే వెంకటేశ్వరరావు,కోమటి విష్ణువర్ధన్, మరీదు హనుమంతు, మద్రివాడ వీరారెడ్డి, సుధాకరరెడ్డి, సాక్షి సాయిబాబు, గంటా కోటేశ్వరరావు వైద్యులు పాల్గొన్నారు.

పుష్కలంగా సాగునీరు



కలిదిండి: మండలంలో సాగునీరు పుష్కలంగా అందుబాటులో ఉందని వ్యవసాయాధికారి కె.విద్యాసాగర్ తెలిపారు. స్థానిక వ్యవసాయ కార్యాలయంలో మండల స్థాయి సలహా మండలి సమావేశం శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత సీజన్‌కు నీటి లభ్యత సరిపడా ఉందని తెలిపారు. ఈ సీజన్‌లో ధాన్యం కొనుగోలు పద్ధతి సభ్యులకు వివరించారు. రైతులు తమ ధాన్యం మిల్లులకు తరలించే వాహనాలకు జీపీఎస్ ట్రాకర్‌ను అమర్చుకోవాలని సూచించారు. చీడపీడ నివారణకు రైతులు అడిగిన పలు ప్రశ్నలకు సమాధానం చెప్పారు. జిల్లా స్థాయి వ్యవసాయ సలహా మండలి సభ్యుడు చిట్టూరి వెంకటేశ్వరరావు, రైతులు పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
గుడివాడ డివిజన్
99516 02865 (గుడివాడ)
99516 02985 (కైకలూరు)
90105 77706 (పామర్రు)
Office mail : sakshiads@gmail.com